# వి వా హ మం గ ళం

[ క థా ని క ]

❀

= శ్రీ హనుమచ్ఛాస్త్రి =

రాత్రి. సుమారు తొమ్మి దవుతుంది. గృహలక్ష్మి వంటిల్లు సద్దుకుంటోంది. గిన్నెలు, చెంబులు చప్పుడుతో పాటు వర విక్రయం, వందేమాతరం పాటముక్కలు పగిలిన గ్రామొఫోన్ ప్లేటుముక్కలసంగీతంలా వినబడుతున్నాయి.

వేసంకాలం. ఆకు అల్లాడ్డంలేదు. కుర్చీ, టేబిలూ, కాగితాలూ పెట్టుకుని వీధిలో కూచున్నాను ఏదో రాద్దామని.

"ఇదిగో— ఇందాకా మీతో చెప్పడం మరిచిపోయాను. సాయంత్రం మీకోసం మా మామయ్య ఒచ్చాడు. అతని కొడుకు ప్రకాశానికి పేటలో రేపు బుధవారం పెళ్లిట. తప్పకుండా రావాలని మరీమరీ చెప్పివెళ్లాడు."

చట్టున తలెత్తి చూశాను.

నుదుటిమీద చెమటలో తడిసి అంటుకున్న తలవెంట్రుకలను సవరించి, కట్టుకున్న పాతగళ్లచీరపైటతో చేతులు తుడుచుకుంటూ మా ఆవిడ సాక్షాత్కరించింది.

"అట్లానా— చాలా బాగుంది. ఇన్నాళ్లూ నీపెట్టెచెరలో దుఃఖించే వెండిచెంబులికీ, సిల్కుచీరలకీ మాంచి విడుదల. పోనీపాపం- ఈ విధంగానైనా రెండుమూడురోజులు వెలుగు చూస్తాయి."

"మీరుందుకూ— నిత్యమల్లెపువ్వుల నిగనిగలాడుతూ— మీఆక్షేపణల కేంగాని ప్రయాణంమాట ఏమిటీ ?

పిల్లలికి మరోనాలుగు చొక్కాలూ— నాకో రెండుచీరలూ, ఒక సబ్బుబిళ్లపెట్టే, చిన్నపిల్లాడికి ఒక బూడ్సులజతా......"

జాపితా అట్లా పెరిగిపోతోంది. నేనందుకున్నాను : "నా కమీజులకు మరో కప్పులజతా, ఒక షేవింగుసెట్టూ, రెండు సిగరెట్ టిన్నులూ, ఒక అమాందస్తా......"

ఇద్దరం నవ్వేశాం.

"అమాందస్తా ఎందుకూ" నవ్వుతూనే కోపంగా అంది.

"పెళ్లి వారికి పనికొస్తుంది" ధీమాగా అన్నాను.

"మీ రంతకన్నా ఎక్కువ బహుమతులిస్తా రనుకోలేదు"

"పాత్రదానం"

గిరుక్కున తిరిగి వెళ్ళిపోతోంది ఇంటోకి.

రసశాస్త్రప్రకారం అది సరసమో, విరసమో చెప్పజాలనుగాని, ఆవిడతో అట్లా పేచీపెట్టుకోవడం, పుల్లవిరుపుమాట లనడం నాకో 'రిలీఫ్'.

నెమ్మదిగా లాలించి వెనక్కి పిలిచాను.

"నవ్వులాటల కన్నదీ నిజంగా అన్నదీ గ్రహించక, అట్లా చిందులుతొక్కుతా వేం? ఇలా రా... తప్పకుండా వెడదాం. మంగళవారం మధ్యాహ్నం రైలుకు. రేపు బజారుకు వెళ్లేటప్పుడు ఏమేం కావాలో చెప్పు... అయితే పెళ్లి ఎన్నాళ్లు?"

పాపం! అల్పసంతోషి! ప్రియంగా ఒక్కమాట ఆడితే చాలు, సీదా చల్లపడి పోతుంది!

"అయిదురోజులూ చేస్తారుట. అవతలి వారు చాలా భారీమనుషులు. ముద్దుముచ్చట్లు బాగా తీరుస్తారు." చాప దగ్గిరగా లాక్కుని తృప్తిగా కూచుంది.

పాపం! ఈ ఆడవాళ్లకి పెళ్లికి వెళ్లడమంటే ఎంత సరదా! ఈ మురికిగుడ్డల్లోంచి-అంటుతప్పాలాల్లోంచి, విసుగెత్తే రోజువారీ బతుకులోంచి కొత్తలోకంలోకి వెళ్లినట్టుంటుందిగావును—హిస్టీరియావాళ్లు, కడుపునొప్పివాళ్లు, ఎప్పుడూ ధుమధుమలాడేవాళ్లు ఇట్టే మారిపోతారు పెళ్లిళ్లలో.

శుభ్రమైన బట్టలు, సెంట్లు—కలకలలాడుతూ ఉత్సాహంతో గంతులేస్తూ కనపడతారు. ఔను పాపం! వాళ్లకి క్లబ్బులా, సభలా, స్నేహితులా, షికార్లా?—దరిద్ర గొట్టు వంటిల్లు, రోగిష్టి పిల్లలు, కసురుకొనే మొగుడు—ఎంత నరకం అనుభవిస్తున్నారు—తెనుగుకుటుంబాల ఆడవాళ్లు!

పెళ్లికి వెళ్లడమంటే నిజంగా నాకూ ప్రాణం లేచివచ్చింది. ఈ మధ్య సజీవమైన-రసవంతమైన పెళ్లే చూడలేదు. తిరపతి మొక్కుబడికి వెళ్లినట్టు యానాం వెళ్లి, తిండికి మొహంవాచి యెకాయెకీ బళ్లల్లో నలిగి చచ్చి—ఛా—ఏం పెళ్లిళ్లు! నిజంగా తెనుగుకుటుంబాల పెళ్లిమాధుర్యమే చచ్చింది ఈకక్కుర్తి కల్యాణాల్లో.

చిన్నప్పుడు చూసిన పెళ్ళిళ్లు తలచుకుంటే ఒళ్లు పులకరిస్తుంది.

పెళ్లిపందిట్లో అడుగు పెట్టేసరికి చల్లని కొత్త తాటాకు వాసన- ఇంట్లో అడుగు పెడితే వడివడిగా తిరిగే శృంగారవతుల జడల్లోని మరువం వాసన— నట్టింట్లో తివాసీల మీద పిల్లలు ఒలకబోసిన పన్నీటి మంచి గంధం వాసన—పెరట్లో గాడిపొయ్యిదగ్గర కొత్తచాపలమీద రాసులుగా గుమ్మరించిన ఉడికిన కూరలవాసన- కళాయిలో పడుచు హృదయంలోని ప్రేమలా తెగమరిగే తియ్యని సంతర్పణ పులుసు 'వాసన — మొత్తంమీద పెళ్లే ఎంత సువాసన!

పందిట్లో శుభప్రదమైన ఆ సన్నని సన్నాయి పాట—కొత్తచీరల కసకసలతో, మెడ గంధ పూతలతో - కొత్తగా కాపరానికి వెళ్లివచ్చిన మరదళ్ల, మేనగోడళ్ల హాస్యాలు—ఏవీ ఇప్పుడు? అంతా పూర్వ వాసన అయిపోయింది. చట్టున వేదుల కవి పద్యం జ్ఞాపకం ఒచ్చింది.

" అలరునకుబోలె నా హృదయమ్మునకును
జన్మమున కొక్కటే వికాసమ్మ చెలియ!"

వెనువెంటనే నా పెళ్లిసంగతులు కళ్లల్లో స్ఫురణగా తిరిగాయి.

* * * *

మార్చినెల బి. ఏ. పరీక్షలు అవుతున్నాయి. మధ్యాహ్నం పేపరు రాసి, హాస్టలుకు చేరి, కోటు తీసి, కాస్త విశ్రాంతి కోసం పడకకుర్చీలో వాలుతూ ఉండగా

కిటికీలో పడివున్న ఉత్తరం కనబడింది. పరీక్షలు అయిపోవడంతోటే— మ రెక్కడికీ షికార్లు కొట్టకుండా సరాసరి ఇంటికి రమ్మని గాభోలు... మా నాన్న దస్తూరీ— పాపం— ఆయనచూపుల్లాగే ఈ అక్షరాలుగూడా నావైపు ఉరుముతూ చూస్తాయి.

ఉత్తరం తీశాను. ఎందుకో... వేళ్లు ఒణుకుతున్నాయి. చదివాను. మళ్లా చదివాను. ఎన్నిసార్లు చదివినా విషయం ఒకటే-మారడంలేదు. ఉత్తరం మడిచి చేత్తో పట్టుకుని కిటికీలోనుంచి శూన్యంగా బయటికి చూస్తున్నాను. 'అనుకున్నంతా అయింది'. మెదడు వేడెక్కి- ఆందోళన పడుతోంది.

'ఈకిటికీఊచలు పళపళ విరిచి బైటికి పారిపోనా' — నవ్వొచ్చింది. ఎక్కడికి? ఎంతదూరం పోతేమాత్రం మెడమీద ఉన్న ఈ వృద్ధహస్తంపట్టు ఒదులుతుంది?

నన్ను పోషించినందుకు, ఇంతచదువు చెప్పించి ఉద్ధరించినందుకు, నామీద రెండు వేలు ఆయనకు ప్రతిఫలం రావాలి. ఆ అమ్మాయి ఎవరో నే నెరగను, నే నెవరో ఆమే ఎరగదు. బ్రతికిఉన్నంతకాలం ఒకరి సంపూర్ణబాధ్యత ఒకరు వహించే వివాహం మా ఇద్దరిమధ్య—ఆహా! ఏమి సన్నివేశం! మమ్మల్ని ఇద్దరినీ కలిపేవి రెండువేలు! ఈ చదువూ, అభిరుచులూ, విచక్షణా, ఎంతఘర్షణ తెస్తున్నాయి—లేకపోతే ఎంత బాగుండును.

కిటికీలోంచి పొడుగ్గా సాగిపోయే రోడ్డు కనబడుతోంది. అప్పుడే కాలేజీగేటు దాటి సావిత్రి, రుక్మిణి రోడ్డుమీద నడుస్తున్నారు. సావిత్రి ఆకుపచ్చ సిల్కురిబ్బనుజడ, రుక్మిణి సిమెంటురంగు చీరా దూరంగా సాగిపోతున్నాయి.

పరుగెత్తుకొని వెళ్లి నామనస్సులోని బాధంతా రుక్మిణితో చెపితే—ఎంత ఉదార హృదయం—ఒక్క చూపుతో, ఒక్క చిరునవ్వుతో ఎంత ఓదార్పు ఇస్తుంది!

తన పుట్టినరోజని ఒకనాడు 'టీ'కి పిలిచి ఎంతగా ఆదరించింది— ఆనాలుగునిమిషాలూ తనచోటిని స్వర్గం చేసుకుంది అప్సరసలా.

"కాఫీలో మీకు పంచదార ఉండ గూడదుగదూ" ఎంత గొప్పగా నవ్వింది! దోసెడు పచ్చకర్పూరం, కుంకుంపువ్వూ కలిపి చల్లినట్లు!

"వద్దు—ఎంత'బిట్టర్'గా వుంటే అంత బాగుంటుంది నాకు"

"ఓహో—శర్మగారు గొప్ప వేదాంతి అవుతారు" మళ్లా నవ్వు. రాజహంస రెక్కలు కొట్టుకుంటూ పైకి లేచినట్టు. తాంబూలాలు - ఛలోక్తులు - పాటలు-నవ్వులు — అంతా కల.

అట్టి ఉత్తమ స్త్రీస్నేహితులుకూడా ఉండ గూడదు నాదరిద్రదేశంలో.

* * * *

హోల్డాలు, సూట్‌కేసు పట్టుకున్న కూలీతో మాయింటి మెట్లెక్కాను. అమ్మా, చెల్లెలూ, తమ్ముడూ నవ్వుమొహాలతో ఎదురువచ్చారు. కొత్తముగ్గులు, తోరణాలు, పందిళ్లు తయారయిపోతున్నాయి.

"నాయనా, ఒచ్చావూ, మరి బెంగలేదు. నిన్నటినుంచి ఒకటే పాట మీనాన్న- సమయానికి ఒస్తావో రావో అని. రేపే పెళ్లి కొడుకును చెయ్యడం. ముహూర్తాని కేమీ

వ్యవధి లేదు. మీనాన్న ఒడుదుడుకుముహూర్తా లెరగవూ నువ్వు? బాజాభజంత్రీలూ, ముత్యాలపాలకీ ఈ ఉదయమే కుదిర్చారు. పాపం - జగన్నాథంమామయ్య సతమతమై పోతున్నాడు. అసలు అతడు తెచ్చాడు ఈ సంబంధం......"

"రక్షించాడు" మా అమ్మధోరణి ఆపడాని కంతకన్న మార్గం కనపడలేదు నాకు. తలవనితలంపుగా వచ్చిన ఈజవాబుకు ఆమె ముఖంలోని ఉత్సాహమంతా ఇంకి తెల్లబోయింది. ఎప్పుడూ నే నంత తుంచినట్టు ఆవిడతో మాటాడలేదు.

లోపలికి వెళ్లాను.

పనిచెయ్యడానికి సుళువుగా బిగగట్టిన పట్టంచుశాలంపంచ, బుజంమీద తడిఅంగాస్త్రం, వేసంకాలంచెమటకు కరిగి ప్రవహించే గంధాక్షతలు,–నాన్నగారు వాకిట్లోని పెద్ద పందిరదగ్గర ఉండి తోరణాలు కట్టిస్తున్నారు.

"భేష్–వచ్చావూ—నీకోసమే చూస్తున్నాం. ఒరేబాబూ, ఏమేనా అంటే మీకు కోపాలుగాని—వస్తూన్నట్టు కాస్త ఉత్తరం ముక్క గాలికి పారేస్తేనేం?...తగని బద్ధకాలూ మీరూనూ!"

"మీమాటకు వ్యతిరేకంకూడానా? ఫలానానాటికి రమ్మంటే రావలసిందే–పొమ్మంటే పోవలసిందే..."

"నామాటమీద నీ కంత గౌరవం ఉండడం వాస్తవమే—గాని నీధోరణిమాత్రం నాకవగాహన కాలేదు"

"కావడాని కేముంది? ఇంత తలవని తలంపుగా నాకు పెండ్లిచేసి సుఖపడమంటున్నారని సంతోషిస్తున్నాను."

"అదా అపరాధం? మరేంఫర్వాలేదులే. ఒకర్ని ఒకరు చూసుకుని, చిరునవ్వులు నవ్వుకుని, ఉత్తరాలు రాసుకుని... స్వయంవరాలు జరగలేదనేనా నీవిచారం? మన బ్రాహ్మణకొంపల్లో ఏనాడైనా జరిగాయా ఇలాంటి అనాచారాలు? మా పెద్దముండాకొడుకుల బొందెల్లో ప్రాణం ఉన్నంతకాలం అలాంటి అకార్యకరణాలికి సుతలామూ వీలుపడదు."

మెడమీది అంగాస్త్రం నేలను కొట్టి విసురుగా పక్క అరుగుమీద కూచున్నారు నాన్నగారు.

సాహసించాను. "వేలకివేలు ఎదటివారిదగ్గర కట్నాలు పిండడం...పిల్లల ఇష్టానిష్టాలతో పనిలేకుండా...ముళ్లుపెట్టడం..."

"సనాతనాచారమా అనిగదూ నీ అభిప్రాయం? నానామాలకూళ్లూ తిని, కిరస్తానీ చదువులుచదివిన మీతోటా మాకు సనాతనమతచర్చ? మీమేలు కోరి మేం ఏంచేస్తే అదీ ఆచారం. మరి నాతో వాదించకు"

లేచి ముఖం అటువైపుతిప్పి,ఒకరాటకు పచ్చికొబ్బరాకును కోపంగా చుట్టబెడుతున్నారు.

నిమిషం నిశ్శబ్దం.

"నాన్నగారూ!"

"ఏంబాబూ?"

"ఫైనల్‌గా ఒక్కమాట చెబుతున్నాను. నాకు ఆపిల్ల... నచ్చకపోతేమాత్రం... ఏమైనా చేసుకోను."

"ముహూర్తనిశ్చయ మయిపోయింది. పెద్దమనుషులతో వ్యవహారం. మాట తిరిగితే

చెప్పుచ్చుకు కొడతారు. నోరెత్తితే మాట దక్కదు. ఆవిడగారు నచ్చకపోతే నచ్చిన అచ్చర ఎక్కడేనా దొరికితే... లేవదీసుకు పో — ఆ బ్రహ్మసమాజంవార్లో ప్రవేశించగానే అనుకున్నా లే."

"పెద్దల... ఆశీర్వచనం"

"త... థా... స్తు"

తల గిర్రున తిరిగింది. గదిలోకి వెళ్లి పడుకున్నాను.

* * *

ఎప్పటిమాట! సుమారు పదేళ్లవుతుంది.

తొట్టిలో పిల్లాడు కదిలి ఏడవడంతో నాభావనాచక్రం ఆగింది. చాపమీద కునికిపాట్లు పడుతూన్న మాఆవిడ ఉలికిపడి లేచి చంటిపిల్లాడి దగ్గరికి వెడుతూ "ఏమి టలాగే కూచున్నారు? దీపం కొగడాలా వెలుగుతోంది. కాగితాలు ఎగిరిపోతున్నాయి— ఇదేనా రాత? లేవండి, రేపు రాసుకుందురు గాని..." అని నవ్వి వెళిపోయింది.

* * *

ఉదయం కళ్లు నులుముకుంటూ నేను పక్కమీదనుంచి లేచేసరికి, మాఆవిడ చేసే కంజాయింపు బహు కట్టుదిట్టంగా వినబడుతోంది. పిల్లలికి ఒంటిమీద నీళ్లు పోసి, తలలు దువ్వి, చొక్కాలు తొడిగి, పువ్వుల్లా తయారుచేసింది. తుడిచిన గదులూ, మడిచిన బట్టలూ నిన్నటికన్న అతిపొందికగా కనబడుతున్నాయి. కాకులు కుయ్యకుండానే తియ్యని పొగలు కక్కే కాఫీ సిద్ధమయిపోయింది. ఇక — శుద్ధాంతంలో అడుగు పెట్టేసరికి— శుభ్రమైన ఉప్పాడచీర, ఊదా సిల్కుజాకెట్, తలనిండా పువ్వులు, ఉదయ సూర్యుడంత కుంకుంబొట్టుతో మా ఆవిడ కాఫీగ్లాసు పట్టుకొని ఎదురువస్తోంది. అప్పుడు స్ఫురించింది: ఓహో — ఈవేళ మంగళవారం, పేట పెళ్లికి వెళ్లాలి. మధ్యాహ్నం మూడుగంటల రైలుప్రయాణానికి ఉదయం ౬ గంటలనుంచి సన్నాహం. బహుదూర దృష్టిమనిషి మా ఆవిడ.

ఆఫీసుకు వెళ్లి అధికారి వేసిన యక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పుకుని హిందూదేశానికి స్వరాజ్యం తెచ్చినట్టుగా నాలుగు రోజులు సెలవు సంపాదించాను. మామీద పగకొద్దీ రైలు ముందే వచ్చి రహస్యంగా వెళిపోతుందేమో అని పదింటికే భోజనాలు చేసేశాం. ఎంతకీ మూడు కావడంలేదు. మా ఆవిణ్ణీ, పిల్లల్నీ పట్ట శక్యంగాకుండా ఉంది. వాళ్లను 'ఎంగేజ్' చేసే మార్గం కనపడ్డంలేదు. పరుపుకట్టడం ఏడిసినట్టుందనీ, ట్రంకుపెట్టెలోంచి బట్టలు తొంగిచూస్తున్నాయనీ, సూట్‌కేస్ తాళం కనపడ్డంలేదనీ 3 గంటలదాకా నోటితో పనిచేసి, ఎట్టకేలకు ఒక వేణ్ణీళ్ల థెర్మోఫ్లాస్కు, చన్నీళ్ల మరచెంబూ, రెండు పెట్టెలూ, నాలుగు పరుపుచుట్టలూ వగైరాతో శృంగేరీశంకరాచార్యపీఠంలా బయలుదేరి సకాలానికి రైల్లో పడి సాయంత్రం అయిదుగంటలకు పేట చేరుకున్నాం.

* * *

మొగపెళ్లివారు ఉదయమే సదరు గ్రామం దయచేసి స్నాతకం వగైరా చేసుకుని విశాలమైన విడిదిమేడలో 'కాంపు' ఖణాయించారు. పదిహేను, ఇరవై మధ్య వయస్సు గల కుర్రజాతి పేక టపాటపా కలిపి పంచుకుంటూ గోల చేస్తోంది ఒక అరుగు

మీద చేరి. కొందరు వృద్ధులు— భోజనాలు పొద్దు పోయాయి గావును—మేడకింది హాల్లో ఇంకా దొర్లుతూనే ఉన్నారు. మేం గుమ్మంలో అడుగు పెట్టేసరికి "అరుగో— శర్మా, సత్యవతీ, పిల్లలూ వచ్చా" రని పెళ్లి పెద్దలు ఆడవారూ, మగవారూకూడా మాకు స్వాగతం పలికి "మీకు బస మేడమీద ఏర్పాటు చేశాం. పైకి పదం" డన్నారు.

సామాను పట్టించుకుని సరాసరి మేడ పైకి వెళ్లి ఒక శుభ్రమైన గదిలో సర్దిం చాను. తిరిగి చూస్తే మా ఆవిడ 'పతా' లేదు. పోలీసుచేతులోంచి తప్పించుకు పారి పోయిన జన్మఖైదీలా స్వజనంలో కలిసి పోయింది. మళ్లా ఇంతట్లో పట్టుకోవాలంటే బోలెడంత సిబ్బందీ కావాలి.

రైలుప్రయాణంలో ఒళ్లంతా నలగ్గొట్టి నట్టుంది. దక్షిణం వైపు కిటికీలోంచి గాలి రివ్వున విసురుతోంది. బెడ్డింగు విప్పి కాస్త నడుం వాల్చాను. అనతిదూరంలో ఉన్న పెళ్ళివారి పందిట్లోంచి శ్రావ్యమైన సన్నా యి 'మరుగేలరా ఓ రాఘవా' పాడుతోంది. చిన్న కునుకు పడుతోంది. గదిలోకి ఇంకో సామాను వస్తూన్న చప్పుడు. కళ్లు విప్పి చూశాను. సామాను వెనక ఒకాయన వచ్చాడు. వయసు చత్వారింశత్ దాటి ఉంటుం దని నిశ్చయం. కళ్లకు ఖరీదైన కొత్తరకం ఫ్రేము కళ్లజోడు. క్లోజు కాలరు కోటు. దానిమీద సన్నని బంగారపు వాచీ గొలుసు మెరుస్తూ వేలాడుతోంది. గుమ్మ టంలాంటి శరీరం. కుంఖం బొట్టు. తల తిల తండులన్యాయం. చూపుల్లో సౌజన్యంకంటె అధికారం ఏలుబడి చేస్తోంది. మీసాలు లేవు. నాకు ఎదురుగా ఉండే గోడవైపు ఎక్కడ ఏ సామాను సర్దవలసిందీ వెండికట్టు బెత్తం మొనతో చెబుతున్నాడు. అయిదు నిమిషాల వ్యత్యాసంలో ఆయనవెంటనే ఒక ఇరవై యేళ్ల చక్కని అమ్మాయి కాలి ముఖమల్ జోడు నెమ్మదిగా చప్పుడు చేసుకుంటూ లోపలికి వచ్చింది. కణ్వమహర్షి వెనకాల వచ్చిన శకుంతలలా ఉంది. ఉపమానం తప్పేమో—

కామినియాఆయిలువాసనతో గూడా ఆ మెజడలోని దవనంవాసన గుప్పున కొట్టింది. చప్పున తల యెత్తి చూశాను. కనకాంబ్రం రంగుసిల్కుచీర కట్టుకుని, ఇంగ్లీషురంగు జార్జెట్ జాకెట్ తొడుక్కుంది. లేతసూర్య కిరణాలు మామిడిచిగురుమీద పడి వెలిగే వింతరంగు ఆమెశరీరానిది. ఆకళ్లెత్తి ఏవైపు చూస్తే అక్కడ ఇంద్రధనుస్సులు పండు తాయి.

మల్లిపువ్వులూ, మామిడిపండ్లూ వేసి తెచ్చిన ఖద్దరుచేతిసంచీ సామానుపక్కను పెట్టి గదినాలుగువైపులాచూసింది. ఎందుకో—

ఆయన కోటువగైరాలు విప్పి రెండు తువాళ్లు తీసి ఒకటి కట్టుకుని, ఒకటి పైన వేసు కుని సబ్బుపెట్టెపట్టుకొని వెడుతూ "రమణ య్యగారు ఇంకా రాలేదా" అన్నారు ఉచ్చైః స్వరంగా నాటకస్వగతంలా. నేను పరధ్యా నంగా ఏదో ఆలోచిస్తున్నాను. 'నిన్నే. మాటాడవేం' అన్నట్టు నావైపు చూశారు. ఆయనకు గవర్నమెంటులో ఏదైనా ఉద్యోగ మేమో—

నేను లేచి కూచుని భయభక్తులు తెచ్చుకుని అన్నాను: "చిత్తం. తెలియదండి. మీకుగాని...కనబడితే...కాస్త... దయచేసి నేనుగూడా వచ్చానని వారితో చెప్పండి...'

పుష్కరం ఈమధ్య ఆరవణయ్యగా రెవరో నే నెరగను. నామాటలోని కొంటెతనం ఆవిడ గ్రహించిందిగాబోలు—ఒకసారి నన్ను వింతగా చూచి నవ్వాపుగుంది. ఆయన స్నానానికీ, ఆవిడ మేడకిందికీ వెళ్లారు.

చీకటిపడుతోంది. మొగపెళ్లివారి తాలూకువారు తండతండాలుగా వచ్చి మేడంతా ఆక్రమించారు. మాగదిగూడా మరి కొన్ని ముఠాలతో నిండిపోవలిసిందే గాని వారిదీ, మాదీ కలిపి సామాను నాలుగు కుటుంబాలకు సరిపడా ఉంది. కనక మరి ఎవరూ ఇందులో జొరబడలేదు. కొంచెం చల్లగాలిలో తిరిగి రావచ్చుగదా అని ఊరి చివరికి వెళ్లి అటూ ఇటూ తిరిగి సుమారు ఎనిమిదిగంటలకు విడిది చేరుకున్నాను.

మా ఆవిడా, ఆ కొత్తమ్మాయీ లోకాభిరామాయణం అందుకున్నారు. ఎంతో కలుపుగోలుతనంగా ఆ అమ్మాయి మాపరువులకు జేరపడి పకపక నవ్వుతూ మాటాడుతోంది.

సుముహూర్తం పదింటికేట. ఈలోపున ఊరేగింపుగూడా అయిపోవాలి. చప్పున భోజనాలు పూర్తిచేసుకు చక్కావచ్చాం.

* * *

ఊరేగింపునుంచి తిరిగివచ్చి పల్లకీ పెళ్లివారి పందిట్లో ఆగింది. సమయానికి చేతిలో ఉన్న బాకా సవరించి దూదేకులసాయబు ఆకాశంపై కెత్తి పట్టేస్తున్నాడు. నిద్రపోతూన్న పిల్లలు హడిలిపడి లేచి ఏకగ్రీవంగా ఏడవడం మొదలుపెట్టారు. బాండువాళ్లు అప్పుడే 'సునోసునో'పాడి ఆపారు. సుముహూర్తానికి వెళ్లాం. లోపలికి వెళ్లే హాలులో మేజువాణీ జరుగుతోంది. నావయస్సువాళ్లంతా ఆప్రాంతంలోనే సర్దుకుంటున్నారు.

"రావోయ్ శర్మా! ఇటు ఇటు" అని అందులోంచి ఒక ఆప్తబంధువు పిలిచాడు. "శర్మ ఫార్టు ఏంటీనాచ్ – పిలవకురా బాబూ" అని ఒకడు.

సుమారు పదేళ్లయింది బోగంమేళంలో కూచుని. పాపం — ఈకళావతుల్లో కళ ఏనాడో పోయింది. అక్కడికి వెళ్లి ఏంబావుకోవాలి. పౌడర్లూ, రంగుచీరలూ, సిల్కురవికలూ కప్పిన రోగిష్ఠిశరీరాలను చూచి చప్పరించడంతప్ప. అథవా—ఒకసారి వెళ్లి కూచున్నా 'ఈదేహం అమ్మకానికి—వలయువారు......' అన్న వేహో జ్ఞాపకంవచ్చి కళ్లనీళ్లపర్యంతం అవుతుంది నాకు. మైలర్లు, డ్రైవర్లు, హోటలుసెర్వర్లుగదా ఈనాటి రసికులు. అణాకానీకి దిగలాగి 'ఈతపళ్ల' పాటలు పాడించి నిర్భాగ్యులంతా ఈమధురమైన సంస్థను చంపేశారు.

తలవంచుకొని లోపలికి నడిచాను. ఓహో—ఏమి నేత్రనిర్వాణం! విశాలమైన ప్రాంగణంలో బాగా అలంకరించిన వివాహ మండపం!

కుడివైపున నాగరికవేషంతో కూచుని, అత్తరు పన్నీరూ, తాంబూలాలూ విరివిగా ఉపయోగిస్తున్న లౌక్యులూ, బంధుకోటీ, పెళ్లిపీటకు ఎదురుగుండా ఒక బ్రాహ్మణ సముద్రం. వినవక్రమేఘాలు దానిమీద అతిజోరుగా ఆడుతున్నాయి. పూచిన తంగేడుపొదల్లా స్త్రీజనం. నల్లనిజడలూ, తెల్లని మల్లెచెండ్లూ ఆ ప్రాంతాన్ని ఏలుతున్నాయి.

ఈపేటస్త్రీల పద్ధతే వేరు—రాచ్చిప్పల్లో, మడిబట్టల్లో కొట్టుకునే బ్రాహ్మణ కుటుంబాల్లో తప్పబుట్టారు. ఎప్పుడూ ఎంత ఉత్సాహంగా చురుగ్గా కలకలలాడుతూ ఉంటారనీ! ముప్ఫైనలభై ఏళ్ల ఆవిడగూడ చీరా రవికా ఎక్కడా మాయనీకుండా, కడిగిన ముత్యంలా తయారై బయటికి వస్తుంది. కనుకనే ఆవూళ్లో ఏశుభకార్యానికి పిలిచినా మహాసరదా అవుతుంది వెళ్ల డానికి.

నేనూ ఒకచోట చదికిలబడ్డాను. బ్రాహ్మణోత్తములు అర్థంతెలియని వేద మంత్రాలతో హోరుపెడుతున్నారు.

"మదర్థం కన్యాం వృణీధ్వమ్"—పెండ్లి కుమారుడు మొహంఎరగని ఒక బ్రాహ్మణ్ణి పిలిచి పావలా చేతిలో పెట్టి నా కోపెళ్లి కూతుర్ని చూసిపెట్టమన్నాడు. బ్రాహ్మడు అక్షతలు దులిపి డబ్బులు రొంటిని దోపి లేచినచోటే కూచున్నాడు. అట్లా నలుగురు. పాపం ఒక్కరూ ఆ అబ్బాయిమాట విన లేదు. డబ్బు తిని దగాచేశారు.

ఆయింటి 'యజమాని' మంచివాడు గనుక అతనిమీద దయగలిగి, పట్టుబట్టలు కట్టుకు వచ్చి అతని కెదురుగా కూచుని మాపిల్లను నీకిస్తానన్నాడు.

"కన్యాం కనకసంపన్నాం కనకాభరణై ర్యుతాం, దాస్యామి విష్ణవే తుభ్యం..."

అన్నీ అబద్ధాలు. పిల్లఒంటిమీద ఒక్క నగకూడా కనపడ్డంలేదు, జడలో నాగమల్లి పువ్వులు తప్ప. వెయ్యిన్నూట పదహారు రూపాయలు మొగపెళ్లివారు కట్నంగా గుంజిన తర్వాత నగలుపెట్టవలసిన పూచీ ఆయన కేముంది ?

"ధర్మార్థకామేషు త్వయైషా నాతిచరితవ్యా" కన్యాదాత అన్నాడు — మహా అర్థం తెలిసినట్టు. "నాతిచరామి" సంస్కృతం ముక్కలు నోటపట్టని ఆ అబ్బాయిచేత పురోహితు డనిపించాడు.

సభలో కూచున్న వృద్ధులూ, ముది ఐదువలూ సాదరంగా స్పృశించిన మీదట—మంగళసూత్రం చేత్తో పట్టుకొని పెండ్లికొడుకు—

"మాంగల్యతంతునాऽనేన మమ జీవనహేతునా, కంఠే బధ్నామి సుభగే..."

అంటూ, తెల్లని కళ్లతో చూచి అమాయికంగా మెడ ఒప్పగించే పెండ్లి కూతురుమెళ్లో కట్టాడు. ముడి పడింది—

నా కళ్లలో ఎందుకో నీళ్లు తిరిగాయి. అబ్బ—ఎంత తియ్యని ముడి! ఎన్నాళ్లకూ విడరానిముడి! సుఖదుఃఖాల్లో - నవ్వే ఏడుపుల్లో నులివెచ్చని కౌగిలింతల్లో— ఒకరి వెంట ఒకర్ని బలంగా లాగే ముడి! దీని బాధ్యత—దీనిలోని అనంతబాధామాధుర్యం ఈ పూపపిందెల కేం తెలుసు ?

తెలిస్తే— వెంటనే— నునుకొత్తసిగ్గుతో ఒకరి నొకరు చూసుకొని, ఎంత హాయిగా —తీయగా నవ్వుకొనేవారు!

మనస్సులో సముద్రపుటలల్లా ఎన్నో ఊహాలు. ఈగ్రంథి-చేతులకూ మెడకూనా?- ఛా! ఎంత విరూపఘటన! రెండు పక్వ హృదయాలలోని స్నేహతంతువుల ముడి— ఎప్పుడో- ఎక్కడో—ఋషుల ఆశీర్వచనాల లో పుట్టిన పవిత్రవివాహసంస్థ తుద కెట్లా తేలింది ?

నిద్ర కూరుకు వస్తోంది. లేచి విడిది మేడవైపు నడిచాను. మేడమీద దీపా లేవీ లేవు. హాల్లో ఒకరిద్దరు చంటిపిల్లలు గావును నిద్దరోతున్నారు.

తడుముకుంటూ గదిలోకి వెళ్లాను. బట్టలు మార్చే ఓపిక లేదు. పరుపుకోసం వెదికాను నిద్రమత్తులో తూలుతూ. పరుపు చక్కగా పరిచివుంది.

అప్పుడే ఒచ్చి శయనించింది గాబోలు మా ఆవిడ. మొగాళ్లకన్న ఓర్మి బద్ధకం మనిషి— పిల్లలతో తగువుపడుతూ ఎక్కడో కూచుని చక్కా వచ్చి ఉంటుంది.

పరుపుమీద ఒరిగాను. పెళ్లివారు రాసిన డిల్‌బహారుసెంటుతో నా లాల్చీ పరిమళిస్తోంది. తీరా పడుకుంటే...... నిద్ర రాదు. దొర్లుతున్నాను.

పెండ్లివారింట్లోంచి చల్లగా ఇంకా పెళ్లి మంత్రాలు వినబడుతున్నాయి.

"సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిద ఉత్తరః..."

నాకు నవ్వొచ్చింది. రెండునిమిషాలు గడిచాయి. మెత్తని తామరతూడువంటి చెయ్యి ఒకటి నామెడమీద పడింది. బంగారు గాజులు చిరుతచప్పుడు చేశాయి. ఆ మృదు స్పర్శకు నానరాలన్నీ భగ్గుమని వెలిగాయి. శరీరం జరుగుతోంది. మెదడు తిరగబడు తోంది. ఎంత చిత్రమైన అనుభవం!

పెళ్లి పచ్చకర్పూరపు తాంబూలంతో పరిమళించే వెచ్చని నాలుగు పెదవులూ, ఉద్రేకంగా కొట్టుకునే రెండు హృదయాలూ అతిదగ్గరగా కలుసుకున్నాయి.

పెళ్లిమంత్రాలు ఇంకా వినబడుతున్నాయి.

"సఖా సప్తపదా భవ సఖాయౌ ... సఖ్యాత్తే మా యోషగ్ం సఖ్యాన్మే మా యోష్ఠాః..."

నేను బయలుదేరిన చోటినుంచి తోవ తప్పి ఏగంధర్వలోకంలోని దేవకన్యకఒడి లోనో పడలేదుకద!

ఆబాహునాళపు సుఖస్పర్శ—పెదవులు కలిపేనేర్పు- ఏ జన్మలోనూ పరిచితమైనట్టు లేదు. ఆమత్తులోంచి లేచి ఆలోచించే త్రాణ లేక బుద్ధి గిలగిల కొట్టుకుంటోంది.

* * *

హఠాత్తుగా కామినియాఆయిలు తీవ్ర పరిమళంతో నాతల తిరిగింది. ఉలికిపడి లేచాను. మనస్సు ఆందోళనతో కొట్టుకుం టోంది. కష్టపడి పెతికి దీపం వెలిగించాను. ఏమి టద! నాకళ్లను నేను నమ్మలేకపోయా ను. ఈమె ఎవరు? నాభార్య కాదు. ఆ కొత్తమ్మాయి శకుంతల! సాయంత్రం ఎవరో పిలుస్తుంటే విన్నాను. ఎంత విచిత్రసంఘటన! నాఆశ్చర్యానికి హద్దులేదు. ఇంద్రజాలమా- వరప్రసాదమా? ఏపితృదేవతాశీర్వాదం, ఏయామినీదేవత, ఏప్రణయఅధిష్ఠానదైవం, ఈలావణ్యరాశిని మాయచేసి నాకు దానం చేశారు?

'దైవమిచ్చిన భార్యా' ఈమె?

తన్నూ, నన్నూ తిట్టుకుని ఎంత కుంగి పోతోందో లోపల? నెమ్మదిగా ముఖమెత్తి చూశాను. రెండు నిమిషాలు ముఖం దాచు కుని మెల్లగా నావైపు చూస్తోంది, చిక్కు- పడిన లోలకులు సవరించుకుంటూ. మాట్లాడడానికి ధైర్యం చాలకపోయినా—

తెగించి అన్నాను: "ఎంత పొరపాటు జరిగింది?" ఆమె మాటాడలేదుగాని ముఖం మాత్రం మలినంగా లేదు. "క్షమిస్తే—మీ ఎదుటనుంచి వెడతాను" లేవబోయాను. ఈ మాట ఆమెను కదిపింది. నావైపు ఒకసారి గంభీరంగా చూచి చిరునవ్వు నవ్వింది. నాకు ఊపిరి తిరిగింది. "మనస్సులో బాధ పోవడానికా నవ్వుతున్నారు" చనువుగా అన్నాను.

"పుట్టుకతోనే వచ్చిన ఈమనస్సులోని బాధకు పోవడమంటూ లేదు... పెళ్లిపందిట్లో కొంతసేపు కూచుని ఏవేవో జ్ఞాపకమొచ్చి—ఏమీ తోచక ఇక్కడికి వచ్చి చేతికిదొరికిన పరుపొకటి పరుచుకు పడుకున్నాను. నాది అన్నదానిమీద అభిమానం ఏనాడో పోయింది. తనకు అన్యాయం చేసినవారిమీద పగతీర్చుకోడానికి బుద్ధిపూర్వకంగా—సంతోషంగా తప్పుచేసే ధైర్యం ఎట్లాగూ లేదు. తలవనితలంపుగా జరిగిన చిత్రకథకు విచారం ఎందుకూ?... మీరు పశ్చాత్తాపపడుతూంటేమాత్రం నిశ్చయంగా నేను విచారిస్తాను."

ఎంత విచక్షణ — ఎంతచిత్తశుద్ధి — సాహసిస్తే దేన్నికైనా స్త్రీయే సాహసించాలి. మగవాడు వట్టి చచ్చుపెద్దమ్మ!

"పశ్చాత్తాపమా? దేనికి? ఈరసికత్వం — ఈ దివ్యానుభవం — ఈఉజ్జ్వల సౌందర్యం—ఎన్ని తపస్సులకు లభ్యమవుతుంది? ఈ స్వర్గీయ అమృతస్వప్నాన్ని ఏనిర్భాగ్యుడు పిడికిలితో పట్టి నిలబెట్టుకోగలడు? ఉత్తరక్షణంలో కరిగిపోతుంది. మళ్లా మామూలు శుష్కజీవితం గిరగిర తిరగడం మొదలెడుతుంది" నాహృదయం వెలిగించిన ఒత్తిలా మాట్లాడింది.

ఆమె అందుకుంది: "అయితే ఈ స్వప్నాన్ని నేను శాశ్వతం చేస్తాను. ఆ కసుగాయలకు ఇప్పుడు వీరంతా అర్థంతెలియని మంత్రాలతో అరిచి చేసింది పెళ్లి కాదు, బొమ్మలపెళ్లి. ఈ ఏకాంతరాత్రి, దక్షిణపుగాలి, చుక్కలు, పాలలా పొంగే యౌవనం మనకు చేసిందే యథార్థమైన పెళ్లి. సరిపడని భర్తతో ఇంతవరకూ కాపరంచేసి చచ్చి, ఇప్పుడు మీపక్కని కొత్తగా పుట్టాను."

లేచి నుంచుంది. కళ్లూ, చెక్కిళ్లూ దీపపు కాంతిలో దుర్నిరీక్ష్యంగా వెలుగుతున్నాయి.

"మీమాంసలవల్ల లాభం లేదు. ఇక ఒక్క పదినిమిషాల్లో 'వారిద్దరూ' వచ్చి ఈ స్వర్గాన్ని నరకం చేస్తారు ... ఏంచేద్దాం... తిరుగులేని నిశ్చయంగా...మన కర్తవ్యం... ఏమిటి?"చురుగ్గా మేడకింది చీకట్లో ఎగిరే మిణుగురులకేసి చూస్తూ అన్నాను.

"కర్తవ్యమా?"

చరచర దగ్గరికి వచ్చి నవ్వుతూ గులాబీ రేకువంటి చేతిని అందిచ్చింది.

అనతిదూరంలో ఉన్న రైల్వేస్టేషన్‌లో అప్పుడే వచ్చి నిలిచిన 'రైలు' ఖంగున కూసింది.